క్లుప్తంగా

రూ.50 వేల విరాళం

మాక్లూర్: అమ్రాద్ ప్రభుత్వ పాఠశాలకు ఎస్ఆర్ఐ ఉదయ్ భాస్కర్ గురువారం రూ.50 వేలను విరాళంగా అందించారు. పాఠశాల స్కూల్ అసిస్టెంట్ పవన్‌కుమార్ చేతుల మీదుగా చెక్కును అందించారు. విరాళం వచ్చిన డబ్బులతో పాఠశాల ఆవరణలో మరుగుదొడ్ల ఏర్పాటుతో పాటు ఇతర మరమ్మతులకు ఉపయోగిస్తామని స్కూల్ అసిస్టెంట్ తెలిపారు. అలాగే 10వ తరగతి(1997–98 బ్యాచ్)కి చెందిన విద్యార్థులు బీరువాను అందజేశారు. అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు రాజేశ్వర్, వినయ్‌సాగర్‌లు బ్లూటూత్ మ్యూజికల్ స్పీకర్‌ను విరాళంగా ఇచ్చారు. వీరందరికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్, విద్యార్థులు, గ్రామస్తులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి



బోధన్: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలో పాల్గొన్న పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(జేసీ) పదో తరగతి విద్యార్థి ఎం. శ్రీకాంత్ ప్రతిభ చాటి ప్రథమ బహుమతి సాధించాడు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసా పత్రం, బహుమతిని అందుకున్నట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు.

మాక్లూర్ విద్యార్థులకు..



మాక్లూర్: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నియోజకవర్గస్థాయిలో జరిగిన వ్యాస రచన పోటీల్లో మాక్లూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థినులు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు చేతుల మీదుగా ప్రథమ బహుమతులను అందుకున్నారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న జె. హర్షిత వ్యాసరచన, జి. అకాంక్ష ఉపన్యాస పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాడు శ్రీహరితో పాటు, ఉపాధ్యాయులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారిని అభినందించారు.

నంది పురస్కారం అందుకున్న విద్యార్థినికి అభినందన




కమ్మర్‌పల్లి: హైదరాబాద్ రవీంద్ర భారతిలో కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నాట్య ప్రదర్శనలో శివనాట్య నంది అవార్డును పొందిన కమ్మర్‌పల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థిని వూట్నూర్ శివానిని పాఠశాల ఉపాధ్యాయ బృందం గురువారం అభినందించింది. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయన్న, ఉపాధ్యాయులు రాజేశ్వర్ గౌడ్, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభ నిర్వహించాలి



రుద్రూర్: రాయకూర్‌లో గ్రామ సభ నిర్వహించాలని అంబేడ్కర్ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కొన్ని నెలలుగా గ్రామ సభ జరపడం లేదని, గ్రామ పంచాయతీ పాలకవర్గం పదవీ కాలం ముగియనున్నందున గ్రామ సభ వెంటనే ఏర్పాటు చేయాలని వారు కోరారు.

జల విద్యుదుత్పత్తి కేంద్రం సందర్శన



బాల్కొండ: ఆర్మూర్ మండలం పెర్కిట్‌లోని క్షత్రియ కళాశాల పాలిటెక్నిక్ రెండో సంవత్సరం విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా పోచంపాడ్‌లోని జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని గురువారం సందర్శించారు. విద్యుత్ ఉత్పత్తి ఎలా జరుగుతుంది..తదితర వివరాలను స్థానిక సిబ్బందిని విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



దొంకేశ్వర్ ప్రభుత్వ పాఠశాలలో..



వర్నిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ నారాయణ



రుద్రూర్‌లో ..



వేల్పూర్ హైస్కూలులో..



కుర్నాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..



ముప్కాల్‌లో తహసీల్దార్ తదితరులు

ఘనంగా ఓటరు దినోత్సవం

సాక్షి నెట్‌వర్క్: బోధన్, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు ఓటరు ప్రతిజ్ఞను స్థానిక యువకులు, ప్రజలు, విద్యార్థులతో చేయించారు. ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి వివరించారు. 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. పాఠశాల విద్యార్థులతో కలిసి మండల కేంద్రాల్లో, గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు.



కమ్మర్‌పల్లిలో ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర సిబ్బంది



మోస్రాలో తహసీల్దార్ శ్రీకాంత్ రావు



ఆలూర్ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



నవీపేటలో..



పెర్కిట్: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



రెంజల్ హైస్కూల్‌లో నూతన ఓటర్లకు కార్డులను అందిస్తున్న ఎంపీపీ రజని, అంగన్‌వాడి టీచర్లు



మాక్లూర్‌లో ..

భీమన్న దేవుడి ఆలయ వార్షికోత్సవం

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో గురువారం ఆదివాసీ నాయకపోడు కులస్తుల ఆరాధ్య దైవం భీమన్న దేవుడి ఆలయ 37వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీలు భీమన్న దేవుడి గదలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దీంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కళ్లెం మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ దుమ్మాజి శ్రీనివాస్, ఆదివాసి నాయకపోడు సంఘం సభ్యులు డాక్టర్ అరుణ్, నవీన్, ముత్తెన్న, తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపు నిర్వహిస్తున్న సంఘం సభ్యులు

బాలికలకు డ్రాయింగ్ పోటీలు



మోర్తాడ్: జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మోర్తాడ్ బాలికల ఉన్నత పాఠశాలలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. అందరు ఆకర్షించేలా బొమ్మలు వేసిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతి, సుజాత, సువార్త, గణ శారద పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలకు ప్రతిపాదనలు

రెంజల్(బోధన్): రెంజల్ పీహెచ్‌సీలో అత్యవసర మౌలిక సదుపాయాల కోసం అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని ఎంపీపీ లోలపు రజని సూచించారు. గురువారం ఆస్పత్రి ఆవరణలో అభివృద్ధి సలహా సంఘం చైర్మన్ రజని అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. రోగులకు ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. ఆస్పత్రిలో ప్రస్తుతం పలు పనుల కోసం రూ.లక్షా 55 వేలు అవసరం ఉండగా ప్రస్తుతం రూ.75 వేల 950 నిల్వ ఉన్నాయని సిబ్బంది వివరించారు. మిగిలిన సొమ్ము ప్రభుత్వం నుంచి వచ్చే వరకు ఆగకుండా ఉన్న నిధులతో పనులు ప్రారంభించాలన్నారు. జెడ్పీటీసీ విజయ, ఎంపీడీవో శంకర్, డాక్టర్ వినయ్ కుమార్, ఆరోగ్య విస్తర్ణ అధికారులు శ్రావణ్‌కుమార్, రవీందర్, ఫార్మసిస్టు రాంచందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రజని

సమాచారం..

దరఖాస్తుల ఆహ్వానం

బోధన్: పట్టణంలోని పాండుఫారం తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ(బాలికల)లో ఖాళీగా ఉన్న తెలుగు అధ్యాపక ఔట్ సోర్సింగ్ పోస్టు భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మజ గురువారం తెలిపారు. అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. తెలుగు సబ్జెక్టులో పీజీ, బీఈడీ విద్యార్హతలతో పాటు రెండేళ్ల అనుభవం ఉండాలని సూచించారు. ఈ నెల 29న లోపు సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

నేడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రాక

బోధన్: స్వేరోస్ ఇంటర్నేషనల్ నెట్‌వర్క్ సంస్థ ఆధ్వర్యంలో సాలూర మండల కేంద్రంలో నిర్మించిన అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం(లైబ్రరీ) నూతన భవనాన్ని శుక్రవారం ప్రారంభించేందుకు ఆ సంస్థ వ్యవస్థాపకులు, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రానున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభోత్సవనంతరం టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించే సమావేశంలో ఆయన ప్రసంగించనున్నారని స్థానిక ప్రతినిధులు సింగాడి పాండు, లింబూరి లక్ష్మణ్‌లు తెలిపారు.

స్వర్ణామృత ప్రాశన కార్యక్రమం

నందిపేట్ (ఆర్మూర్): మండల కేంద్రంలోని కేదారేశ్వర ఆశ్రమంలో గురువారం స్వర్ణామృత ప్రాసన పంపిణీ కార్యక్రమం ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములు మహారాజు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆశ్రమ కమిటీ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి ఉర్సు వేడుకలు

భీమ్‌గల్: బాబాపూర్‌లో బాబా(బావయ్య) గుట్టపై నేటి నుంచి ఉర్సు వేడుకలు ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు సాగే ఈ ఉర్సు ఉత్సవాలకు మండల ప్రజలే కాకుండా బోధన్, నిజామాబాద్‌ల నుంచి భక్తులు భారీగా తరలి వస్తారు.

దీపారాధనతో వేడుకలు ప్రారంభం

ఉర్సు ఉత్సవాల సందర్భంగా బాబా షేక్ నాథర్షా వాలీపై ఉన్న చాదర్లు, దట్టీలను తొలగించి పవిత్ర జలంతో శుభ్రపరుస్తారు. దీపారాధన చేసి వేడుకలు ప్రారంభిస్తారు. అనంతరం పవిత్ర గంధం వెదజల్లి, పూలతో కూడిన నూతన చాదర్‌తో అలంకరిస్తారు. మత పెద్దల ఆధ్వర్యంలో నమాజ్ నిర్వహించి భక్తులను దర్గాలోనికి ప్రవేశం కల్పిస్తారు. ప్రారంభ వేడుకలకు పలు ప్రాంతాల నుంచి ముస్లిం మత పెద్దలు హాజరవుతారు. మూడు రోజుల పాటు సాగే ఉర్సు ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



హైదరాబాద్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు



ఆర్మూర్, ఆలూర్ నుంచి వెళ్తున్న నేతలు



ఉమ్మడి బాల్కొండ నుంచి..

పెర్కిట్(ఆర్మూర్): హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆర్మూర్, ఆలూర్ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ పొద్దుటూరి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో నేతలు తరలి వెళ్లారు. కార్యక్రమంలో ఆలూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర విజయ్ తదితరులున్నారు.

బాల్కొండ: కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి సమావేశానికి ఉమ్మడి బాల్కొండ మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల అధ్యక్షులు వెంకటేశ్, ముత్యంరెడ్డి, కొత్తింటి ముత్యంరెడ్డి, డీసీసీ డెలిగేట్ జైడి రవి, తదితరులు ఉన్నారు.

దేశాభివృద్ధిలో యువత ముఖ్య పాత్ర పోషించాలి

- రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్లూరి శ్రీనివాస్



బోధన్‌టౌన్(బోధన్): భారత దేశ అభివృద్ధిలో యువత ముఖ్య పాత్ర పోషించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్లూరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జాతీయ ఓటరు దినోవ్సతం సందర్భంగా గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నమోనవ్ మద్దాత సమ్మేళనంలో ప్రధాన మంత్రి మోదీ ప్రత్యక్ష వర్చువల్ కార్యక్రమాన్ని విద్యార్థులు వీక్షించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరై మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి సుధాకర్‌చారి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి శ్రీకాంత్, అసెంబ్లీ కన్వీనర్ యోగేష్, పట్టణ అధ్యక్షుడు బాలరాజు, కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు మోక్షమెప్పుడో?

- నలభై ఐదు రోజులు గడిచినా పట్టించుకోని అధికారులు
- ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- ఇప్పటికైనా త్వరగా మంజూరు చేయాలని కోరుతున్న ప్రజలు



బోధన్ తహసీల్ కార్యాలయంలో కుప్పలుగా ఉన్న దరఖాస్తులు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంతో పాటు మండలంలోని విద్యార్థులు, ప్రజలు ఆదాయ, కులం, రెసిడెన్షియల్, ఫ్యామిలీ ధ్రువ ప్రతాల కోసం నెల క్రితం దరఖాస్తు చేసుకున్నా సంబంధిత ధ్రువపత్రాలు ఎప్పుడు మంజూరు చేస్తారో తెలియని పరిస్థితి ప్రస్తుతం తహసీల్ కార్యాలయంలో ఉంది. దరఖాస్తు చేసి 45 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ సంతకాలు కాక కార్యాలయంలోని ఇన్‌వర్డ్ గదిలో వందల సంఖ్యలో కుప్పలుగా పడి ఉన్నాయి. నెల రోజుల నుంచి ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ అంటూ అధికారులు కార్యాలయంలో అందుబాటులో లేకుండా పోయారు. అనంతరం ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ అంటూ పక్షం రోజులు గడిచి పోయాయి. దీంతో ఆదాయ, కుల, రెసిడెన్షియల్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. దీంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెల కొంది. ఇంటర్ మొదటి ఏడాది చదివే విద్యార్థులు ఉపకార వేతనాల కోసం ఈ నెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా ఇప్పటి వరకు ఆదాయ, కులం, రెసిడెన్షియల్ ధ్రువ పత్రాలు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి త్వరగా ధ్రువపత్రాలు మంజూరు చేయాలని విద్యార్థులు, ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు భద్రతా మాసోత్సవాలు

బాల్కొండ: మండల కేంద్రంలో నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో గురువారం రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతా నిబంధనలు, నియమాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయవద్దన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. వాహనదారులకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముప్కాల ఎస్సై భాస్కరాచారీ, పీఆర్వో స్వామి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే ముప్కాల్ మండల కేంద్రంలో న్యూ హరిజోన్స్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు.



కరపత్రాలను అందజేస్తున్న ముప్కాల్ ఎస్సై

అందరి సహకారంతోనే సమస్యల పరిష్కారం

రెంజల్(బోధన్): గ్రామస్తులు, అధికారుల సహకారంతోనే సమస్యల పరిష్కారం సాధ్యమైందని కూనేపల్లి సర్పంచ్ రొడ్డ విజయ లింగం పేర్కొన్నారు. గురువారం సర్పంచ్‌తో పాటు పాలకవర్గం సభ్యులను కార్యదర్శి, గ్రామస్తులు పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. పాలకవర్గం సభ్యులతో పాటు సిబ్బందికి కార్యదర్శి కృష్ణ పూలమాలలు వేసి శాలువాతో సత్కరించి మెమొంటోలను అందించారు. అనంతరం గ్రామ పెద్దలు సర్పంచ్ దంపతులను సత్కరించారు. ఉప సర్పంచ్ మల్లేశ్, మాజీ ఎంపీటీసీ సాయిలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



సభ్యులను సన్మానిస్తున్న కార్యదర్శి, గ్రామస్తులు

ఆయుర్వేద వైద్య శిబిరం



రుద్రూర్: పోతంగల్ మండలం హంగర్గ క్యాంపులో గురువారం ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆయుర్వేద వైద్యులు ప్రేమలత ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి 64 మందికి ఆయుర్వేదిక్ మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయుర్వేద చికిత్స విధానం గురించి వైద్యులు వివరించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, ఆయుష్ ఫార్మసిస్ట్ పురుషోత్తం, హెల్త్ అసిస్టెంట్స్ సుభాషిణి, విజయ, ఆశ కార్యకర్తలు రేఖ, సమత, సునీత, మమత పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



బోధన్: కార్మికులు ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న హక్కులను రద్దు చేసి కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రతినిధి మల్లేష్ డిమాండ్ చేశారు. గురువారం సాలూర మండల కేంద్రంలోని జీపీ కార్యాలయం ఆవరణలో యూనియన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని పేర్కొన్నారు. కార్మికులు నాగయ్య, పీరాజీ, సాయిలు, రామారావు, లక్ష్మి, సక్కుబాయి, శంకర్, గంగారాం, గంగాధర్, సతీష్, రాహుల్, సావిత్రి పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

మోర్తాడ్: మోర్తాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని వివిధ వార్డులలో దోమల నివారణ కోసం మందును పిచికారీ చేయించారు. ఫాగింగ్ యంత్రంతో పొగను మురికి కాలువలు, చెత్తకుప్పలపై చల్లించడం వల్ల దోమలు చనిపోయి ప్రజలకు ఇబ్బందులు ఉండవని సిబ్బంది తెలిపారు. ప్రజలు సహకరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ కోరారు.

ఆలయంలో అన్నదానం

కమ్మర్‌పల్లి: ఉప్లూర్‌లోని సాయిబాబా ఆలయంలో గురువారం పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేసి, పల్లకీ సేవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు నందగిరి దయానంద్, పోలపల్లి లచ్చయ్య, బద్దం గంగారెడ్డి, శ్రీధర్, రాజేందర్, నరేష్, మురళి, రాజేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	గుంటూరు కారం (తెలుగు) - 12.30, 6.50, సైంధవ్(తెలుగు)- 3.50 నా సామిరంగ (తెలుగు) 10.10
స్క్రీన్-2 –	ఫైటర్ (హిందీ) 3డీ - 11.15, 2.50, 6.25, 10.00
స్క్రీన్-3 –	హనుమాన్ (తెలుగు)- 11.30, 2.50, 6.10, 9.30
స్క్రీన్-4 –	హనుమాన్ (తెలుగు) - 12.40, 7.10, 10.30 నా సామిరంగ (తెలుగు)- 4.00